

సందడిగా భోగి పండుగ

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరు,దారకొండ, దుప్పిలివాడ, గుమ్మిరేవులు, గాలికొండ పంచాయతీ పరిధి గ్రామాల్లో ప్రజలు ఆదివారం భోగి పండుగను వైభవంగా జరుపుకున్నారు. తెలుగువారి సాంప్రదాయాలకు అనుగుణంగా ఆంధ్ర ఒడిశా సరిహద్దు గ్రామాల గిరిజనం భోగిమంటలు వేసి, ఆవు పేడతో తయారు చేసిన పిడకలను చిన్నారులు ఆ మంటల్లో వేస్తే, చలిమంటలు కాగుతూ కేరింతల కొడుతూ పరస్పరం భోగి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రతి ఇంటి ముంగిట్లో మహిళలు రంగురంగుల రంగవల్లులు వేసి, గొబ్బెమ్మలు పెట్టారు.. మకరసంక్రాంతి పండుగకు స్వాగతం పలుకుతూ మహిళలు సందడి చేశారు. ఆనందోత్సాహాల్లో మునిగితేలారు

పెదబయలు :మండలంలోతిగులంక పంచాయతీ పరిధిలో భోగి పండగ సందడిగా మారింది ఆదివారం ఉదయం మంచుకురుస్తున్న సమయం లో పాతబడిన వస్తువుల్కగొ భోగి మంటల్లో వేసి నిప్పంటించి చలిమంటలు కాచారు ఆడపడుచులు జానపద గీతాలతో దింసా నత్యాలు చేశారు

గిరిజన పల్లెలు కళకళ

-వాడవాడలా భోగి సంబరాలు-సంప్రదాయబద్ధంగా సంక్రాంతి వేడుకలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: మన్యంలో సంక్రాంతి పండగను గిరిజనులు వైవిధ్యంగా జరుపుకుంటారు. మైదాన ప్రాంతంలో భోగి, మకర సంక్రాంతి, కనుమ..ఇలా మూడు రోజులు నిర్వహిస్తారు. ఏజెన్సీలో మాత్రం పక్షం రోజులు నిర్వహిస్తారు. గిరిజన సంప్రదాయాలకు అనుగుణంగా రెండు వారాలపాటు వేడుకలను నిర్వహిస్తారు. ఈ పండగ రోజులను గిరిజనలు ఎంతో పవిత్రంగా భావిస్తారు. ఇతర ప్రాంతాల్లో మాదిరిగానే ఏజెన్సీలో సంక్రాంతి పండగ తొలిరోజనే గిరిజనులు సైతం భోగి పండుగ జరుపుకుంటారు. పండగలో భాగంగా గ్రామంలోని పాత వస్తువులు, తదితర కర్రలను భోగి మంటలో వేస్తారు. అలాగే భోగిమంట వద్దే నీళ్లను కాచుకుని, వాటితో స్నానమాచరించడం మంచిదనే భావన గిరిజనుల్లో ఉంది. భోగి స్నానాలు చేసిన తర్వాత కొత్త దుస్తులు వేసుకుంటారు. కొత్త కుండలో కొత్త బియ్యం, పప్పులతో పులగం తయారు చేసి గ్రామంలో అందరికీ పంచుతారు. భోగిమంట వేయడం ద్వారా మొదలై గొట్టి పండగ, బారిజంతో ముగిస్తాయి. దీనికోసం ఒకచోట సమావేశం అవుతారు. గ్రామానికి అవసరమైన తలారి, బారిక, పశువుల కాపరిని ఎన్నుకుంటారు. భోగి రోజు నుంచి ప్రతిరోజు రాత్రి వేళల్లో డప్పు వాయిద్యాలు, దింస నత్యాలతో సందడి చేస్తారు. దీంతో ఈ పక్షం రోజులు గిరిజన పల్లెలో సందడి వాతావరణం నెలకొంటుంది. ప్రధానంగా ఇతర గ్రామాల్లోని వారి బంధువులు, స్నేహితులను తమ గ్రామాలకు ఆహ్వానిస్తారు. గిరిజనులు పక్షం రోజులు అటూ ఇటూ పండగ చుట్టాలుగా రాకపోకలు సాగిస్తారు. పండగ ముగిసే వరకు ప్రతిరోజు రాత్రిళ్లు పిల్లలు పెద్దలు అనే తేడా లేకుండా మహిళలు దింసా నృత్యాలు, పురుషులు డప్పు వైద్యాలతో సందడి చేస్తారు. దీంతో, ఏజెన్సీలోని వారపు సంతలు సైతం జనంతో కళకళలాడతాయి. పండగకు అవసరమైన కొత్త కుండలు, డప్పులు, దుస్తులు, ఇతర వస్తువులు కొనుగోలు చేస్తుంటారు. పండగ సామాగ్రిని కొనుగోలు చేసేందుకు వారపు సంతలకు వచ్చేటప్పుడే.. తమ వారికి పండుగ కబుర్లు చెబుతుంటారు. అలాగే వారపు సంతలకు సైతం కుటుంబ సమేతంగా వెళ తుంటారు. దీంతో ప్రతి ఏడాది పక్షం రోజులు మన్యంలో పండగ సందడి నెలకొంటుంది.

పనిముట్లకు పూజలు..

భూమి మీద ఆధారపడి వ్యవసాయంతో జీవనం సాగించే గిరిజనులు తమ వ్యవసాయ పనిముట్లకు పూజలు నిర్వహించే రోజునే సంక్రాంతిగా భావిస్తారు. దీంతో భోగి మరుసటి రోజు సంక్రాంతి నిర్వహించుకుని తమ పనిముట్లకు పూజలు చేస్తారు.

బుడియాల సందడి:

మన్యంలో సంక్రాంతి పండగ సందడిలో భాగంగా గిరిజన గ్రామాల్లో పురుషులు జట్టుగా కలిసి వివిధ వేషధారణలతో ఇంటింటికి వెళ్లి ఆటపాటలతో సందడి చేసి పండగ మాములు అడగడం సంప్రదాయం. రెండు వారాలు మన్యంలో యువత బుడియ వేషధారణలతో ఇంటింటికి తిరిగి సందడి చేస్తారు. ఇచ్చిన నగదును బృందం సభ్యులు పంచుకొని పండగ ఖర్చులకు వినియోగించడం గిరిజన ప్రాంతంలో సంప్రదాయంగా కొనసాగుతుంది.



పాడేరులో భోగి మంటను కాగుతున్న గిరిజనులు

సాంప్రదాయ బద్ధంగా సోబోరి ,బుడియా

డుంబ్రిగుడ:సంక్రాంతి పండగను ఏజెన్సీలో గిరిజనుల ఆచార, సాంప్రదాయాల బద్ధంగా జరుపుకుంటారు.ప్రాంతాల వారీగా సుమారు మూడు, నాలుగు వారాలపాటు జరుపుకుంటారు. వివిధ రంగాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారంతా పండగ రోజు గ్రామంలో కుటుంబ సమేతంగా తరలి వచ్చి గ్రామస్తులతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి పలకరించి పండుగను జరుపుకుంటారు. పండుగను పురస్కరించుకొని గ్రామ దేవునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆ తర్వాత ఇద్దరు యువతీ ,యువకులను బూడిద రాసి, విచిత్ర వేషధారణ వేయించి పూజలతో పాటు ఆ ఇద్దరు యువతీ ,యువకులు కూడా మూడు రోజులపాటు ఉపవాసం ఉంటారు. మొదటిరోజు దేవునికి డప్పు వాయిద్యాలతో గ్రామంలోని ప్రతి ఇంటికి నంది దేవునికి ఊరేగింపుగా తీసుకెళ్తారు.ఆ సమయంలో ఆ గ్రామంలో దొరికిన నాటు కోళ్లను పట్టుకొని తీసుకెళ్ళి పోవడం ఆనవాయితీ. నాటు కోళ్ల పెంచుకునే గిరిజనులు నంది దేవుని ఊరేగింపుగా తీసుకు వస్తున్న రోజున పట్టుకెళ్ళి పోతారనీ ఆ రోజు బయట పంపించకుండా ఇంట్లోనే కోళ్లను దాచుకుని పెట్టుకుంటారు .రెండవ రోజు ఏడాదిలో పండించిన పంటలు తొలి ముద్దగా భావించి పశువులకు నీటిగా స్నానం చేయించి పాలతో పరమాన్నం వండి పశువులకు తినిపిస్తారు. ఆ తర్వాత కుడుములు తయారుచేసి, నాగలి దుంపలు కలిపి పశువులకు మెడలో కడతారు. వాటిని చిన్న పిల్లలు సరదాగా తెంపుకుని తింటే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని భావన. పూజలు నిర్వహించి మేకను కోసి, ఇంటింటికి చిన్నచిన్న ముక్కలు కోసి పంచి పెట్టడం పూర్వం నుంచీ వస్తున్న ఆచారం. మూడవబ రోజు కుటుంబ సమేతంగా అందరూ కలిసి పిండివంటలు చేసి ఇంటింటికి పంచిపెడుతూ ఆనందంగా గడుపుతారు. ఈ పండగ సందర్భంగా నచ్చిన యువతిని, ఆమెకి ఇష్టమున్నా లేకపోయినా పెళ్లి చేసుకోవడానికి ఎత్తుకెళ్లి పోవడం గతంలోనున్న గిరిజనుల సంప్రదాయం.

సోబోరి నృత్యం,సేరు బుడ్డి య ప్రత్యేకం :

ఈ పండుగను పురస్కరించుకొని గ్రామంలోని యువతీ,యువకులు మండల పరిధిలో జరిగే వారపు సంతల్లో, గ్రామంలోని కిరాణా దుకాణాల్లో గడపగడపకు ఆడ, మగ వేషధారణ వేసి సోబూరి నృత్యం ప్రదర్శిస్తూ చందా వసూలు చేస్తుంటారు .చిన్నపిల్లలు బూడిద రాసుకొని విచిత్ర వేషధారణతో షేర్ బుడియ వసూళ్లు చేస్తుంటారు. వచ్చిన డబ్బులతో గ్రామంలో మూడు రోజుల పాటుగా గిరిజన సాంప్రదాయమైన దింసా కార్యక్రమం ఏర్పాటు చేస్తుంటారు .చిన్న పెద్ద, ఆడ మగ తేడా లేకుండా కుటుంబ సమేతంగా గ్రామస్తులంతా కలిసి దింసా నృత్యం ప్రదర్శిస్తూ ఆనందంగా గడుపుతారు.ప్రభుత్వ ఉద్యోగులుగా ,వివిధ రంగాల్లో ఉద్యోగులుగా మైదాన ప్రాంతాల్లో పనిచేస్తున్న వారంతా సంక్రాంతి పండగ రోజు తరలివస్తారు. ఉద్యోగస్తులు, నిరుద్యోగులు అన్న బేధం లేకుండా అందరూ సమానంగా కలిసిపోయి మూడు రోజులపాటు దింసా నృత్యం ఆడుతారు.



డుంబ్రిగుడలో థింసా నృత్యం చేస్తున్న గిరిజన మహిళలు

అంగన్‌వాడీల నిరసన జ్వాలలు

-భోగి మంటల్లో షోకాజ్ నోటీసులు దగ్ధం

ప్రజాశక్తి-పాడేరు:భోగి మంటల్లో అంగన్వాడీల నిరసన జ్వాలలు ఎగిసి పడ్డాయి. అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు ఆదివారం 34వ రోజు సమ్మెలో భాగంగా అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో నిరసన శిబిరం వద్ద భోగి మంటలు వేసి ప్రభుత్వం జారీ చేసిన షోకాజ్ నోటీసులు, ఎస్మా ప్రతులను దగ్ధం చేశారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, నెల సరి వేతనం 26 వేలు పెంచాలని గత కొన్ని రోజులుగా సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడి హెల్పర్స్ అండ్ వర్కర్స్ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి అప్పలనర్స మాట్లాడుతూ, అంగన్వాడి సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం మొండి వైఖరి అవలంభిస్తోందని విమర్శించారు. అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ తమ కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం సుమారు 34 రోజులు పాటు సమ్మె జరుగుతుంటే సమస్యలు పరిష్కారం చేయకపోగా రాజకీయలు అంటగట్టడం సరికాదని అన్నారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యవర్గ సభ్యులు, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి భాగ్యలక్ష్మి, కార్మికులు చిన్నారి, అంబిక, దేవి, జానకి, భవాని, చిన్నతల్లి తదితరులు పాల్గొన్నారు.



షోకాజ్ నోటీసులు దగ్ధం చేస్తున్న అప్పలనర్స

అనంతగిరి: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని స్థానిక సిపిఎం జెడ్పిటిసి దీసరి, గంగరాజు విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పలు చర్చల పేరుతో కాలయాపనం చేస్తుందని విమర్శించారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ప్రభుత్వాలు తుంగలోతుకి కార్మికులకు కనీస వేతనాలు చెల్లించకుండా ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తుందని విమర్శించారు.ఈ కార్యక్రమంలో టోకురు సిపిఎం సర్పంచ్ కిలో ,మొస్య , సిపిఎం మండల కార్యదర్శి ఎస్.నాగులు, అంగన్వాడి యూనియన్ నాయకురాలు సిహెచ్ కళావతి, కార్యకర్తలు చిలకమ్మా, సరస్వతి, కన్నయ్య కుమారి, రాజేశ్వరి పాల్గొన్నారు.

చింతూరు: అంగన్వాడీల నిరవధిక సమ్మెలో భాగంగా సమ్మె శిబిరం వద్ద భోగీమంటల్లో ఎస్మా చట్టం, జిఒ 2 ప్రతులను దగ్ధం చేశారు. అంగన్వాడీ యూనియన్ అధ్యక్షులు సవలం వెంకటరమణ యూనియన్ కోశాధికారి కామేశ్వరి. సభ్యులు జయ. కనకదుర్గ. స్వరూప. భద్రమ్మ. చిట్టమ్మ. చుక్కమ్మ. సత్యవతి. విజయకుమారి. పాల్గొన్నారు.

కూనవరం : అంగన్వాడీల నిరవధిక సమ్మెలో భాగంగా సమ్మె శిబిరం వద్ద భోగి పండుగ నిర్వహించి భోగి మంటలలో ఎస్మా ప్రయోగం, జిఒ2 ప్రతులను స్థానిక ప్రజల సమక్షంలో దగ్ధం చేసారు. సిఐటియు నాయకులు అన్నపూర్ణ, మండల కార్యదర్శి కొమరం పెంటయ్య, తాళ్లూరి శ్రీనివాసరావు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు పాయం సీతారామయ్య పాల్గొన్నారు

విఆర్ పురం: అంగన్‌వాడీల నిరవధిక సమ్మెలో భాగంగా రేఖపల్లిలోని సమ్మె శిబిర వద్ద రంగురంగుల రంగవల్లికలు వేసి, భోగీపండుగను జరుపుకుని నిరసన చేపట్టారు నిరహారదీక్ష చేస్తున్న అంగన్‌వాడీలకు మిడ్డే మీల్స్, సిఐటియు కార్మికులు సంఘీభావం ప్రకటిచారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పూణెం. సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు సున్నం రంగమ్మ, మండల అధ్యక్షులు నాగమణి మాట్లాడుతూ, అంగన్‌వాడీలకు ఇస్తున్న వేతనాలపై మంత్రి బొత్స సత్యనారాయణ అసత్యాలను చెబుతున్నారని మండిపడ్డారు. అంగన్వాడీల యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు. మాట్లాడుతూ, ఇప్పటివరకు శాంతియుతంగా సాగిన అంగన్వాడీల సమ్మె ఉద్యమరూపం దాలుస్తుందని, జరిగే పరిణామాలకు జగన్‌రెడ్డి ప్రభుత్వానిదే బాధ్యత అని హెచ్చరించారు.



విఆర్ పురరంలో

అస్తవ్యస్తంగా ఎపి ఫైబర్‌నెట్ సేవలు

-అవస్థలు పడుతున్న దారకొండ వినియోగదారులు

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం దారకొండలో ఎపి ఫైబర్ సేవలు అస్తవ్యస్తంగా ఉన్నాయని వినియోగదారులు ఆవేదన చెందుతున్నారు. దారకొండ పంచాయతీ పరిధిలో 150 ఫైబర్ కనెక్షన్లు ఉన్నాయని, అయితే సాంకేతిక లోపాలు తలెత్తితే సమాచారమిచ్చినా నిర్వాహకులు పట్టించుకోని పరిస్థితి ఉందని ఆరోపించారు. ఎపి ఫైబర్ వినియోగదారులకు సేవలు అందించేందుకు, ఏదైనా సమస్య తలెత్తితే పరిష్కరించేందుకు కోరపల్లికి చెందిన సమీలు అనే యువకుడిని నియమించారన్నారు. అయితే సమస్య వచ్చినప్పుడు అందుబాటులో ఉండడం లేదని అంటున్నారు.

ఎపి ఫైబర్ కనెక్షన్ తీసుకున్నప్పుడు, ఇప్పుడూ మెరుగైన సేవలు అందిస్తామని చెబుతున్నారే తప్ప అమలులో ఎక్కడా కనిపించడం లేదని జయరాజు అనే వినియోగదారుడు ఆవేదన చెందుతున్నాడు. ఎపి ప్రభుత్వానికి చెందిన సంస్థ కావడంతో సేవలు బాగుంటాయని ఆశించి ఎపి ఫైబర్ నెట్ కనెక్షన్ వేసుకున్నా, సేవలు బాగోలేకపోవడంతో డిస్కనెక్ట్ చేసుకున్నానని. చిట్టిబాబు అనే వినియోగదారులు అంటున్నాడు. నెలసరి బిల్లు చెల్లించకపోయినా, బిల్లు చెల్లింపులో లేటు అయితే ఫైన్ వసూలులో పక్కాగా ఉంటున్న ఫైబర్‌నెట్, సేవల్లో మాత్రం సరిగా ఉండడం లేదని వాపోతున్నాడు. రిసీవర్ బాక్స్ మరమ్మతులకు గురైతే రూ.రెండు వేలు నుంచి రూ.మూడు వేలు వరకు వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్నాడని పలువురు వినియోగదారులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ఎపి ఫైబర్ నెట్ యంత్రాంగం స్పందించి, దారకొండ పంచాయతీ పరిధిలో ఎపి ఫైబర్‌నెట్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించి, మెరుగైన సేవలు అందించే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఎట్టకేలకు వీధిదీపాల ఏర్పాటు

ప్రజాశక్తి -సీలేరు: మండలం సీలేరు పంచాయతీలో సర్పంచ్ దుర్జో ఆధ్వరంలో వీధిదీపాలు వేశారు. వీధిలైట్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని సర్పంచ్ దృష్టికి తేగా, నిధుల కొరత ఉన్నప్పటికీ సంక్రాంతి పండుగకైనా వీధిదీపాలు వెలుగులు ప్రజలకు ఇవ్వాలన్న ఉద్దేశ్యంతో దుర్గా వీధి , అల్లూరి వీధి, చింతపల్లి క్యాంపు, లైకాన్‌పూర్, చంద్రుపల్లి, సిపిహెచ్ క్యాంపు, మసీదు లైన్, పార్వతి నగర్ తదితర చోట్ల శని ఆదివారాల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. సర్పంచ్ దుర్జో స్పందించి వీధిదీపాలు వేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



విద్యుత్ బల్బులు వేయిస్తున్న సర్పంచ్

అప్పన్నను దర్శించిన హైకోర్టు చీఫ్ జస్టిస్

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నను ఆదివారం భోగి పర్వదినాన్ని పురస్కరించుకొని హైకోర్టు జస్టిస్ ధనుంజయ్‌సింగ్ టక్కర్ కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఇఒ సింగాల శ్రీనివాసమూర్తి ఆలయ సాంప్రదాయ ప్రకారం సాదరంగా స్వాగతం పలికారు. కప్ప స్తంభం ఆలింగనం, బేడా మండపం ప్రదక్షిణ,ి స్వామి అంతరాలయంలోనూ గోదాదేవి సన్నిధిలో గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించగా, ఇఒ దుశ్శాలువాతో సత్కరించి స్వామి ప్రసాదాన్ని చిత్రపటాన్ని అందజేశారు.

ఆర్థిక ప్రయోజనాల కల్పనలో నిర్లక్ష్యం

ప్రభుత్వ తీరుకు యుటిఎఫ్ నిరసన... జిఒ ప్రతుల దహనం





విఆర్ పురం, కూనవరంలలో జిఒ 2, ఎస్మాప్రతులను దగ్ధం చేస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి- విఆర్.పురం: ఉద్యోగ ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలు చెల్లింపులో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వైఖరిని నిరసిస్తూ, ప్రభుత్వం జారీ చేసిన జిఒలను యుటియఫ్ రాష్ట్ర కమిటి పిలుపులో భోగి మంటల్లో దగ్ధం చేశారు. యుటిఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో సున్నంవారిగూడెం, ములకనపల్లి గ్రామాల్లో నిర్వహించిన నిరసనలో యుటిఎఫ్ జిల్లా నాయకులు సోడి నాగేశ్వరరావు, నాయకులు ఎస్.రాజులు, ఎన్.జగదీష్, ఎన్.రామకృష్ణ, ఎన్.ప్రసాద్, రాము, వెంకటేష్, వీర్రాజు, రతన్, సురేశ్ పాల్గొన్నారు.

కూనవరం: మండలంలోని పెదార్కూరు గ్రామంలో యుటిఎఫ్ కూనవరం మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వం జారీ చేసిన ఆర్థికపరమైన జిఒ కాఫీల ప్రతులను భోగి మంటల్లో దగ్ధం చేశారు. యుటిఎఫ్ ఐటిడిఎ సబ్ కమిటీ కన్వీనర్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ఎం.వెంకటనారాయణ, యుటిఎఫ్ .కూనవరం మండల అధ్యక్షప్రధాన కార్యదర్శులు నాగేశ్వరరావు, కన్నారావు, మండల కోశాధికారి ఎం.రాంబాబు, కుమారి, లలిత, మహేతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటనారాయణ మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు ఎపిజిఎల్ఐ క్లెయిమ్‌లు రూ. 330 కోట్లు, సరెండర్ లీవ్ బకాయిలు రూ. 4,500కోట్లు, 30 శాతం ఇంటీరియమ్ ఫండ్ వెంటనే చెల్లించాలని పి.ఆర్.సి.డి.ఏ. అరియర్లు రూ. 7382 కోట్లు చెల్లించాలని డిమాండ్ చేశారు.

డుంబ్రిగుడ:ఉద్యోగ, ఉపాధ్యాయులపై చేపట్టిన ఉద్యమాలపై ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలో ఆదివారం జరుపుకున్న భోగి మంటలో యుటిఎఫ్ నాయకులు ప్రతులను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎస్ బాలకృష్ణ, నాయకులు ఏం.మోహన్‌రావు, కె.బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి:ఉద్యోగుల, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు చెల్లించాలని భోగి మంటల్లో ప్రభుత్వ జిఒ ప్రతులను దహనం చేశామని అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి పుడిగి దేముడు, ఉమ్మడి జిల్లా పూర్వ సహ అధ్యక్షులు శెట్టి రాంబాబు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగ ఉపాధ్యాయుల న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానో ఉపాధ్యాయురాలు దుడ్డు, స్వరూపరాణి, కార్య వర్గ సభ్యులు పడల్, యూటిఎఫ్. ప్రధాన కార్యదర్శి సింహాచలం, గంగరాజు పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వ పాలనపై టిడిపి నిరసన

-భోగి మంటల్లో ప్రజావ్యతిరేక జిఒలు

ప్రజాశక్తి - రంపచోడవరం : నియంతృత్వపోకడలో సిఎం జగన్‌రెడ్డి ప్రభుత్వం జారీ చేసిన ప్రజావ్యతిరేక జిఒలను టిడిపి ఆధ్వర్యంలో భోగి మంటల్లో వేసి దగ్ధం చేశారు. ఆదివారం తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు మండలంలోని సీతపల్లి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌ఛార్జి వంతల రాజేశ్వరి ఆధ్వర్యంలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని వైసిపి పాలనకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ గడచిన ఐదేళ్లలో జగన్‌రెడ్డి జారీ చేసిన న ప్రజా వ్యతిరేక జిఒ ప్రతులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు.



జిఒ ప్రతులను దగ్ధం చేస్తున్న టిడిపి నేతలు

ఈ సందర్భంగా వంతల రాజేశ్వరి మాట్లాడుతూ వైసిపి పాలనలో అథోగతి పాలైన రాష్ట్రంలో అభివృద్ధి వెలుగులు రావాలంటే వచ్చే ఎన్నికల్లో టిడిపి, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పెంటపాటి అనంతమోహన్, అరకు పార్లమెంట్ ఎస్‌టి సెల్ అధ్యక్షులు కారం సింహాచలం, యువత అధ్యక్షులు సిద్దా వెంకన్న దొర, యూనిట్ ఇన్‌ఛార్జి కుమ్మమ్ బాపన్న దొర, మడకం పండు దొర, బూత్ ఇంఛార్జి కోసు నాగన్నదొర, పాక రాజు,కొమరం రాము, బాబ్జీ, కూర అబ్బాయి పాల్గొన్నారు

రాష్ట్ర ప్రభుత్వానికి రిటర్న్ గిఫ్ట్ ఇస్తాం

అంగన్వాడీ దీక్షలకు యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ వెంకటేశ్వరరావు మద్దతు

రంపచోడవరం : ఉద్యోగుల సమస్యలు పరిష్కరించుకుంటే జగన్ ప్రభుత్వానికి రిటర్న్ గిఫ్ట్ ఇస్తామని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. ఆదివారం రంపచోడవరంలోని తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో అంగన్వాడీల దీక్ష శిబిరాన్ని సందర్శించి, యుటిఎఫ్ తరపున మద్దతు తెలిపారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్‌తో కలిసి రాష్ట్ర ప్రభుత్వం అప్రజాస్వామికంగా జారీ చేసిన జిఒలను భోగిమంటల్లో వేసి దహనం చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, సిపిఎస్ రద్దుచేసి పాత పింఛను పునరుద్ధరిస్తామని హామీఇచ్చిన సిఎం జగన్ దాన్ని అమలు చేయకపోగా, గుదిబండ లాంటి జిపిఎస్‌ను రుద్దారన్నారు.ఒపిఎస్ పునరుద్ధరణ కోరుతూ ఈనెల 24న మండల, జిల్లా కేంద్రాల్లో నిరసన, 31నుంచి వచ్చేనెల 4వరకు నిరాహారదీక్షలు చేస్తామని, అప్పటికీ దిగిరాకుంటే చలో విజయవాడ ఆందోళన చేపడతామన్నారు.

అంగన్వాడీల సమ్మెకు మద్దతుగా కోటి సంతకాల సేకరణలో భాగంగా యుటిఎఫ్, సిఐటియు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సంతకాలను చేసి సంఘీభావం ప్రకటించారు కార్యక్రమంలో ఆదివాసీగిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఈతపల్లి సిరిమల్లె రెడ్డి, అంగన్వాడి నాయకులు కె రామలక్ష్మి, యుటిఎఫ్ అల్లూరి జిల్లా అధ్యక్షుడు విల్సన్ బాబు, జిల్లా కోశాధికారి కె.కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కె ఆదిరెడ్డి, రంపచోడవరం మండల అధ్యక్షులు సిహెచ్ సనాతన బాబు, ప్రధాన కార్యదర్శి వెంగళరావు, కె.సూరిబాబు, గంగవరం, దేవిపట్నం మండలాల అధ్యక్షులు యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

మంత్రముగ్ధంగా చలిమంచు అందాలు

అవస్థలు పడినా, పరవశించిపోయిన సందర్శకులు



సీలేరులో దట్టంగా కురుస్తున్న పొగమంచు

ప్రజాశక్తి -సీలేరు: జికెవీధి మండలం సీలేరులో ఆదివారం తెల్లవారుజాము నుంచి ఉదయం 8 గంటల వరకు విపరీతంగా మంచు కురుస్తూ, చలిగాలులు వీస్తూ ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేసింది.రెండు మూడు రోజుల నుంచి చలి, మంచు తీవ్రత కాస్త తగ్గుముఖం పట్టిందని ప్రజలు భావించినప్పటికీ, ఆదివారం భోగి పండుగ రోజు చలి తీవ్రత అధికం కావడంతో పాటు మంచు విస్తీర్ణంగా కురవడంతో ప్రజలు భోగి మంటలు వద్ద చలి కాగుతూ ఉపశమనం పొందారు. మంచు కారణంగా వ్యాపారులు దుకాణాలు 9 గంటల వరకు తెరవలేదు. మరోపక్క సంక్రాంతి సెలవులు కావడంతో సీలేరు పరిసర ప్రాంతాల్లో మంచు అందాలు, ప్రకృతి రమణీయ దృశ్యాలు తిలకించేందుకు సందర్శకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు చిత్రకొండ బలిమెల రిజర్వాయరు సమీపంలో ఉన్న చిల్డ్రన్ పార్క్, బోట్ షికార్ సందర్శించి మంత్రముగ్ధులయ్యారు. సీలేరు నుంచి దారకొండ, సప్పర్ల, గూడెం, చింతపల్లి ప్రధాన రహదారి గుండా సందర్శకులు ప్రయాణిస్తూ ప్రకృతి దశ్యాలు, గలగలలాడుతూ, జారువారే జలపాతాలు అందాలను తిలకించి పరవశించిపోయారు. అక్కడ నుంచి లంబసింగి చేరుకొని కాశ్మీర్‌ను తల పెంచే మంచు అందాలు చూసి, అటునుంచి అటుగా అరకు బొర్రా గుహలు వైపు తరలిపోయారు.

ఏళ్లు గడుస్తున్నా... నిర్మాణం కాని స్పోర్ట్స్ కాంప్లెక్స్

నిరాశలో క్రీడాకారులు

ప్రజాశక్తి -గాజువాక

గాజువాక నియోజవర్గం మొత్తానికి ఏడు ఎకరాల విస్తీర్ణంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని 1999వ సంవత్సరం నుంచి ప్రణాళిక తయారుచేస్తున్నారు తప్ప, నేటికీ నిర్మాణం చేపట్టలేదు. ఇప్పటికి నలుగురు ఎమ్మెల్యేలు మారారు. ప్రతిపాదనలు ఎక్కడవేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉంది. వైసిపి ప్రభుత్వంలో ముత్తంశెట్టి శ్రీనివాసరావు గెలిచిన నెల రోజుల్లోనే క్రీడామంత్రి హోదాలో మాట్లాడుతూ, ఏడాదిలో దీని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన మంత్రి పదవి కాలం పూర్తయినా నిర్మాణానికి నోచుకోలేదు. 2004వ సంవత్సరంలో హెచ్‌పిసిఎల్ యాజమాన్యం సిఎస్ఆర్ నిధులనుంచి రూ.ఏడు కోట్లు కేటాయించింది. పాలకులు శ్రద్ధ చూపకపోవడంతో హెచ్‌పిసిఎల్ యాజమాన్యం ఆ నిధులను వెనక్కి తీసుకుంది. రాష్ట్రంలోనే గాజువాక నియోజవర్గం తలసరి ఆదాయంలో ప్రథమ స్థానంలో ఉందని చెబుతారు. గాజువాక నియోజకవర్గం జనాభా కూడా ఎక్కువగానే ఉన్నారు. క్రీడాకారులూ ఎక్కువగానే ఉన్నారు. గాజువాక నుంచి క్రికెట్ మ్యాచ్ సెలెక్ట్ అయిన వ్యక్తి కూడా ఉన్నారని విషయం తెలిసిందే. అయినా గాజువాకలో ఒక క్రీడా మైదానం కూడా లేకపోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఈ మైదానం ఎన్నిక హామీగా మిగిలిపోతుంది తప్ప నెరవేరిన సందర్భంగా కనిపించడం లేదు. స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం జరిగితే స్థానిక క్రీడాకారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎప్పటినుంచో క్రీడాకారులు ఎదురుచూస్తున్నారు. కానీ ఇంతవరకు దీని సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి కదిలికి రాలేదు. నాలుగు సార్లు శంకుస్థాపన చేశారు తప్ప పనులు మాత్రం ప్రారంభం కాలేదు. ప్రస్తుతం ప్రహరీ కూడా శిథిలావస్థకు చేరుకుంది. రాత్రి సమయంలో మైదానంలోపలకు వెళ్లడానికి వీలుగా ఉండడంతో, మందుబాబులకు నిలయంగా తయారయింది. రాత్రి సమయంలో మద్యం తాగి ఖాళీ సీసాలు గ్రౌండ్లో విసిరివేయడంతో, ఉదయం వాకింగ్‌కు వెళ్లే వారి కాళ్లకు తగిలి గాయాలపాలవుతున్నారు. దీన్ని వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాను



స్పోర్ట్స్ కాంప్లెక్స్ గురించి చాలాసార్లు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాను. బడ్జెట్‌లో నిధులు తక్కువ ఉండడంతో కేటాయించలేకపోయారు.

తిప్పల నాగిరెడ్డి
గాజువాక ఎమ్మెల్యే

ఎన్నికల కోడ్‌తో ఆగింది



టిడిపి హయాంలో పూర్తి కావలసి ఉంది. ఎన్నికల కోడ్ రావడంతో ఆగింది. ఆ మైదానానికి అడ్డంగా ఉన్న ఆదర్శ్ స్కూల్‌ను వేరే ప్రాంతానికి తరలించే ప్రయత్నం నేనే చేశాను. గాజువాక ఆదర్శ గ్రౌండ్‌లో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం జరగాలి.

పల్లా శ్రీనివాసరావు
గాజువాక మాజీ ఎమ్మెల్యే



స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం జరగాల్సిన స్థలం ఇదే...



తగరపువలస శివాలయం వద్ద నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

నిర్వహణలో నిర్లక్ష్యం..

- నిరుపయోగంగా ఫైబర్ మరుగుదొడ్లు
- రన్నింగ్ వాటర్ సదుపాయం లేక మూలకు..
- అపరిశుభ్రతకు నెలవై వినియోగానికి దూరం
- అటకెక్కిన స్వచ్ఛ భారత్ లక్ష్యం

ప్రజాశక్తి -తగరపువలస

"ప్రతి అడుగు - పరిశుభ్రత వైపు" అనే నినాదం ఆచరణలో ఎక్కడా కనబడని పరిస్థితి. స్వచ్ఛభారత్‌లో భాగంగా పలుచోట్ల ఏర్పాటుచేసిన ఫైబర్ మరుగుదొడ్లుతో పాటు సాధారణ మరుగుదొడ్లు కూడా రన్నింగ్ వాటర్ సదుపాయం లేక, అపరిశుభ్రంగా మారి చివరకు వినియోగానికి దూరమయ్యాయి. వీటిని ప్రారంభించడంలో ఉన్న హడావిడి, ఆర్భాటం, తర్వాత నిర్వహణలో ఏమాత్రమూ శ్రద్ధ చూపకపోవడం, మరో వైపు పర్యవేక్షణ కొరవడడం, అధికారుల చిత్త శుద్ధి లేమి, ప్రజల్లో అవగాహన లేక పోవడం ఇలా అనేక కారణాలతో మరుగుదొడ్లు ఏర్పాటు లక్ష్యం నెరవేరలేదనే చెప్పాలి.

స్థానిక శివాలయం ఎదురుగా 8 ఫైబర్ మరుగుదొడ్లు రన్నింగ్ వాటర్ సదుపాయం లేక నిరుపయోగంగా మారాయి. కొందరు ఎత్తి తెచ్చుకున్న నీటితో వీటిని వాడడం వల్ల అపరిశుభ్రమై, చివరకు వాడుకలేని పరిస్థితి ఉంది. దీంతో అనివార్యంగా ఇవి నిరుపయోగంగా మారాయి. వీటి వల్ల పరిసరాలు కూడా అధ్వానంగా తయారయ్యాయి.

జివిఎంసి ఒకటో వార్డు రామన్నపేట తుపాను రక్షిత భవనానికి దగ్గర్లో గతంలో నిర్మించిన సామాజిక మరుగు దొడ్లు రన్నింగ్ వాటర్ సదుపాయం లేక నిరుపయోగంగా మారాయి. అంతే కాకుండా అపరిశుభ్రతకు నెలవై వినియోగానికి దూరంగా ఉన్నాయి. దీంతో మరుగుదొడ్ల సదుపాయం లేక ముఖ్యంగా స్థానిక మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. లక్షలు ఖర్చు చేసి నిర్మించిన మరుగుదొడ్లను మరమ్మతు పనులు చేసి వినియోగంలోకి తేవాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.



రామన్నపేటలో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

లక్ష్యానికి దూరంగా 'ఉపాధి'

- రోజు వేతనం రూ.272 కాగా రూ.260 లభ్యత
- ఏడాదిలో 2లక్షలా 20 వేల పని దినాలు కల్పన లక్ష్యం
- లక్షా 59 వేల పని దినాలు కల్పన
- విధుల్లో ఒత్తిడికి గురవుతున్న క్షేత్ర సహాయకులు

ప్రజాశక్తి -భీమునిపట్నం

వలసల నివారణకు ఉద్దేశించి ప్రారంభించిన మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం లక్ష్యాల సాధనలో ఆశించిన స్థాయిలో ఫలితాలు సాధించడం లేదనే చెప్పాలి. ఇందుకు కేంద్ర ప్రభుత్వ విధానాలే కారణమని చెప్పక తప్పదు. భీమునిపట్నం మండలంలో 2023 ఏప్రిల్ నుంచి అదే ఏడాది మార్చి వరకు 2 లక్షలా 20 వేల పని దినాలు కల్పన లక్ష్యం కాగా, లక్షా 59 వేల పని దినాలు కల్పించారు. మండలంలో 5 వేల జాబ్ కార్డులు ఉండగా, 1400 మంది కూలీలు పని చేస్తున్నారు. వీరంతా చెరువుల్లో మట్టి తవ్వకం, సాగునీటి కాల్వల పనులు, మొక్కల పెంపకం లాంటి పనులు చేస్తున్నారు. మరికొంత మంది కూలీలు జగనన్న ఇళ్ల నిర్మాణం పనులను చేస్తూ ఎన్‌ఆర్ఇజిఎస్ కింద మస్తరు వేయించుకొని వేతనం పొందుతున్నారు. ఇలా పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యాన జరిగే అభివృద్ధి పనుల్లో కూడా ఉపాధి హామీ చట్టం కింద వేతనం పొందుతున్నారు.

పని ఒత్తిడిలో ఫీల్డ్ అసిస్టెంట్లు

ఫీల్డ్ అసిస్టెంట్లు విధుల్లో తీవ్ర పని ఒత్తిడికి గురవుతున్నారు. 16 పంచాయతీలకుగానూ 14 పంచాయతీల్లో ఉపాధి పనులు జరుగుతున్నాయి. 15 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరే పనులు పర్య వేక్షిస్తారు. ఏడు రిజిస్టర్లు నిర్వహిస్తున్నారు. కూలిపనికి వచ్చేటప్పుడు, వెళ్ళేటప్పుడు ఎన్ఎంఎంఎస్ యాప్ (నేషనల్ మొబైల్ మోనటరింగ్ సిస్టం) ద్వారా హాజరు వేస్తారు. మా న్యువల్‌గా కూడా రిజిష్టర్‌లో హాజరు వేస్తారు. ఎక్కడెక్కడ స్థిరాస్తులు ఎన్ని ఉన్నవీ వీరే గుర్తిస్తారు. ఏడాదికి ఒక కుటుంబానికి వంద రోజులు పని కల్పించే భాధ్యత కూడా వీరిదే. అయితే ఇప్పటి వరకు 140 మందికి ఏడాదికి 100 రోజులు పని కల్పించగలిగారు. ఇంతకీ వీరికి నెలకు ఇచ్చే వేతనం రూ.10 వేలుతో కుటుంబ పోషణ కష్టమనే చెప్పాలి. తమకు వేతనాలు పెంచాలని, ఫిక్స్‌డ్ టెన్యూర్ ఎంప్లాయ్ (ఎఫ్‌టిఇ)గా గుర్తించాలని, మ్యాన్ డేస్ పని విధానం రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

మేట్ ల పరిస్తితి మరీ దారుణం

కొలతలు వేయడం, వాటిని క్యూబిక్ మీటర్లలో లెక్కించడం, మస్టరు వేయించడం ఇలా ఫీల్డ్ అసిస్టెంట్లకు సహాయకులుగా ఉండే మెట్‌లకు ఎటువంటి వేతనాలూ లేవు. రెండేళ్ల క్రితం వరకూ కూలితో పాటు వారానికి వేతనం లెక్క కట్టి ఇచ్చేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. మండలంలో ప్రస్తుతం 60 మంది మేట్‌లు పని చేస్తున్నారు.

రోజు వేతనం రూ.260

ఉపాధి కూలీ రోజు వేతనం రూ.272గా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అయితే నేల స్వభావం, మట్టి గట్టిగా ఉండడం లాంటి కారణాల వల్ల రూ.260 లభిస్తోంది.



భీమిలి మండలం సింగన బందలో ఉపాధి పనిలో కూలీలు

రెడీమేడ్‌గా ఇంటి రుచులు..!

- హోంపుడ్స్, స్వీట్ దుకాణాలకు పెరిగిన తాకిడి
- సొంతింటి వంటకాలు విశాఖలో తగ్గుముఖం



ద్వారకానగర్‌లోని ఓ స్వీట్ షాపులో సాగుతున్న పిండి వంటల అమ్మకాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ నగరంలో రెడీమేడ్ వంటకాల హవా క్రమేపీ పెరుగుతోంది. సంక్రాంతి వంటి పండగ వేళల్లోనూ రెడీమేడ్ రుచులపైనే నగర వాసులు ఆసక్తి కనబరుస్తున్నారు. ధరలు పెరగడం, తయారీ పద్ధతులు తెలియకపోవడం, పని ఒత్తిళ్లు వంటివి దీనికి కారణాలుగా చెప్పొచ్చు.

సంక్రాంతి వచ్చిందంటే వారం ముందు నుంచీ వంటింట్లో ఒకటే సందడి. ఒకప్పుడు ఇంట్లో ఉన్న పెద్ద వాళ్లు పండగకు వచ్చే బంధువులు, కొత్త అల్లుళ్ల కోసం పిండి వంటలు సిద్ధం చేయడంలో బిజీగా ఉండేవారు. అరెసెలు, జంతికలు, పాకుండలు, బూరెలు, సున్నుండలు, పొంగడాలు, గోరు మిటీలు, గులాబీ పువ్వులు, నువ్వుల ఉండలు వంటి వంటకాలతో ఇళ్లన్నీ ఘుమఘుమలాడేవి. వీటి తయారీలో తల్లికి కూతురు, అత్తకు కోడలు సహాయపడే సన్నివేశాలు చూడముచ్చటగా ఉండేవి. పండగలో పిండి వంటలు పెద్దలు ఎలా తయారు చేస్తున్నారో ఇంట్లో పిల్లలు గమనించేవారు. అయితే ఇదంతా గతం. మారుతున్న పరిస్థితులరీత్యా జీవన విధానంలోనూ మార్పులొచ్చాయి. యువత పిజ్జాలు, బర్గర్లు, పప్స్ అంటూ నూతన వంటకాలపై మక్కువ చూపుతున్నారు. దీంతో కొన్నిరకాల పిండి వంటలు కనుమరుగవుతున్నాయి. కొంతమంది యువకులకు పొంగడాలు, పాకుండలు, అరిసెలు అంటే తెలియని పరిస్థితి నెలకొందంటే అతిశయోక్తి కాదు. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుదల కూడా పండగ వంటపై పెను ప్రభావాన్నే చూపుతున్నాయి. మిఠాయిల్లో వాడే బెల్లం కిలో రూ.60 నుంచి రూ.70, పంచదార ధరలు రూ.50కిపైనే పలుకుతున్నాయి. వంటనూనెల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పిండి వంటలు తయారు చేసేందుకు ఉపయోగించే బియ్యం, శనగపిండి, మినప పప్పు, పెసరపప్పు వగైరా వాటితో పాటు వంటగ్యాస్ ధర కూడా భారీగా పెరిగింది. సాంకేతిక రంగాభివృద్ధిలో భాగంగా ఎస్ఎంఎస్‌లు, మెయిల్స్, వాట్సాప్‌లు అందుబాటులోకి రావడంతో అమ్మలక్కల పలకరింపులు, ముచ్చట్లు దూరం అయ్యాయి. పెరిగిన ధరలు, ఆర్థిక ఇబ్బందులు, సమయాభావం, సహాయకుల కరువు వంటి కారణాలతో పిండివంటల తయారీపై పల్లెల్లోనే పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఇక విశాఖపట్నం వంటి నగరంలో పరిస్థితి చెప్పనక్కర్లేదు. అంతా రెడీమేడ్ కల్చర్ నెలకొంది. స్వీట్స్, బేకరీల షాపుల్లో అప్పటికే తయారైన పదార్థాలను కొని తెచ్చుకుని పండగను చేసుకోవడం క్రమేపీ పెరుగుతోంది.

ధరలు ఇలా... (కిలో ఐటమ్ - రూపాయల్లో..)

చక్కెర పొంగలి - 400
పులిహోర - 300
పాకం గారెలు (ఒకటి) - 30
బూరెలు - 500
అరిసెలు - 400
కజ్జికాయలు - 300
ప్లెయిన్ గారెలు (ఒకటి)20
సున్నుండలు - .400
జంతికలు - 300
పొంగడాలు - 400
పాకుండలు - 400
గులాబీ పువ్వులు - 400

ఎక్కడ లభ్యమవుతున్నాయి ?

హోంపుడ్స్, స్వగృహ, స్వీట్ సెంటర్లలో పిండి వంటలు లభ్యమవుతున్నాయి. గారెలు, బూరెలు, చక్కెర పొంగలి, పులిహోర, పాకం గారెలు, అరిసెలు వంటివి హోల్ సేల్ ధరల్లో లభ్యమవుతున్నాయి. పెద్ద మొత్తంలో ఆర్డర్లు చేసేవారి సౌకర్యార్థం డోర్ డెలివరీ సదుపాయాన్ని కూడా నిర్వాహకులు కల్పిస్తున్నారు. పండుగ సందర్భాల్లో పల్లె ప్రాంతాలకు వెళ్లలేని వారు, పిండి వంటల తయారీలో అవగాహన లేనివారు, పిండి వంటలకు అవసరమైన సామగ్రి అందుబాటులో లేనివారు, అన్నీ అందుబాటులో ఉన్నా తయారు చేసుకునే ఓపిక లేనివారు రెడీమేడ్ షాపులను ఆశ్రయిస్తున్నారు.

ప్రత్యేక కౌంటర్లు

నగరంలోని హోమ్ ఫుడ్స్, స్వీట్స్ దుకాణాల్లో పిండి వంటల విక్రయాల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు అమ్మకానికి సిద్ధంగా ఉన్న స్వీట్లును ఆకర్షణీయమైన ప్యాకింగుల్లో కొనుగోలుదారులకు అందజేస్తున్నారు. పెద్ద మొత్తాల్లో కావాల్సిన వారి నుంచి పది రోజుల ముంచే ఆర్డర్లు తీసుకుని వంటలను అందజేస్తున్నారు. హోం డెలివరీపై దూరాన్ని బట్టి రూ.80 నుంచి రూ.100 వరకు సర్వీసు ఛార్జీ వసూలు చేస్తున్నారు. పండగ సందర్భంగా పిండి వంటలు లేవనే చింతను ఇలా హోమ్ ఫుడ్స్, స్వీట్ స్టాల్స్ నిర్వాహకులు తీరుస్తున్నారు. రెడీమేడ్ వంటకాలు అందుబాటులో లేకుంటే కొన్ని పదార్థాలను పిల్లలకు పరిచయం చేసే పరిస్థితి ఉండేది కాదని పలువురు చెబుతున్నారు.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న వంటకం

మహా నగరంలో పతంగుల పండగ

- మార్కెట్లో బోలెడు రకాలు లభ్యం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : గాలిపటానికీ, కొత్త పండగ రోజులకూ గొప్ప అవినాభావ సంబంధం ఉంది. పతంగుల సరదా లేకుంటే నగరంలో సంక్రాంతి సంబరాల్లో ఏదో తెలీని వెలితి కనిపిస్తూ ఉంటుంది. అందుకే నగర వాసులు కొద్ది కాలంగా కైట్స్ ఫెస్టివల్స్ నిర్వహిస్తూ సందడిని షురూ చేస్తున్నారు. అందునా బీచ్ విస్తరించి ఉన్న మన సిటీలో పతంగుల సరదాలకు కొదువేమంటుంది చెప్పండి. ఒకప్పుడు ఓ కాగితం, రెండు కొబ్బరి పుల్లలతో ఎవరి గాలిపటాలు వాళ్లే తయారు చేసి ఎగురేసుకునేవాళ్లు. ఇప్పుడు మార్కెట్‌లో ఎవరెవరి కోరికకు తగినట్టుగానే వివిధ రకాల ఆకారాలలో తయారు చేసిన పతంగులు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటికే అమ్మకాలు ప్రారంభమయ్యాయి.

పతంగుల రెపరెపలతో బీచ్‌రోడ్డులో సంక్రాంతి సందడి నెలకొంది. ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా చిన్నా, పెద్దా తేడా లేకుండా గాలిపటాలు ఎగురవేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. సంక్రాంతి పండగను మూడు రోజుల పాటు చేసుకోవడంలో ఎంతో ఆనందం దాగి ఉంటుంది. ఈ పండగలో సంప్రదాయమైన గాలిపటాలు ఎగుర వేయడం కూడా ఆనవాయితీగా వస్తోంది. అయితే గాలిపటాలను ఎగురవేయడానికి ఎక్కువ స్థలం, అనువైన ప్రదేశాలు ఉండటంతో గ్రామీణ ప్రాంతాల్లో పతంగులను ఎగురవేయడంలో పెద్దగా సమస్యలుండవు. కానీ కాంక్రీట్ కీకారణ్యంలా మారిన విశాఖ వంటి నగరాల్లో మాత్రం పతంగులను ఎగురవేసేందుకు సరైన స్థలం లేకపోవడంతో ఎత్తైన భవనాలపైన, గోడలపైన నిల్చుని మరీ గాలిపటాలను ఎగురవేసే దృశ్యాలు మనకు కనిపిస్తుంటాయి. ఇది అత్యంత ప్రమాదంతో కూడుకున్న వినోదమనే చెప్పాలి.

ఆకట్టుకునే డిజైన్లు

గాలిపటాల డిజైన్లలోనూ ఎన్నో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. ఒకప్పుడు సాదాగా ఉండే గాలిపటాలు తర్వాత పక్షులుగా, విమానాలుగా, కొన్నిరకాల జంతువులుగా మార్పు చెందాయి. కానీ తాజాగా ఓడల రూపంలోనూ, పాములుగానూ, చివరకు పిల్లలను అత్యంత ఆకట్టుకునే డోరోమెన్, ఛోటా భీమ్, స్పైడర్‌మెన్, యాంగ్రీబర్డ్‌తోపాటు ప్రధాని మోడీ, అమితాబ్ వంటి బొమ్మలతో కూడా పతంగులు తయారవుతుండటం విశేషం. గ్రద్ధ, తూనిగ, గుడ్ల గూబ, గబ్బిలం, డేగ, బటర్ ఫ్లై వంటి బొమ్మలతో కూడా పతంగులు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి.

అన్నీ దిగుమతి చేసుకున్నవే..

గతంలో ఇళ్లలోనే కాగితాలతో గాలి పటాలను తయారు చేసుకునేవారు. వీటిని సరైన ఆకృతిలో తయారు చేస్తేనే గాలిలో ఎగురగలవు. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి మారింది. రంగు రంగుల్లో విభిన్న డిజైన్లలో, ఆకృతుల్లో ఉన్న ఆకర్షణీయమైన గాలిపటాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో కొల్‌కతా, ఖరగ్‌పూర్ వంటి ప్రాంతాల నుంచి కంటైనర్ ద్వారా విభిన్న రూపాలలో తయారైన గాలిపటాలను కూడా ఈ సారి అధికంగా విక్రయిస్తున్నారు. దళసరి ప్లాస్టిక్ కాగితంతో తయారు చేసిన గాలిపటాలకు ప్రస్తుతం డిమాండ్ ఉంది. ఈ సారి క్లాత్‌తో తయారు చేసిన గాలిపటాలు సైతం అందుబాటులో ఉన్నాయి. వీటి ధరలు రూ.10 నుంచి రూ.1000 వరకు ఉన్నాయి. వీటికి దారం చాలా ప్రత్యేకమైనది.. దృఢమైనదిగా ఉండాలి. ఇలాంటి దారపు ఉండలను నైలాన్, ఇతర రసాయనిక పాలిమర్స్‌తోనూ తయారు చేస్తున్నారు. ఈ దారపు ఉండలను ఎక్కువుగా హైదరాబాద్, బెంగళూరు ప్రాంతాల నుంచి నగరానికి రప్పిస్తున్నారు.

దొరికే స్థలాలు

ఇక పతంగులు ఎక్కువగా పూర్ణామార్కెట్, అల్లిపురం, డాబాగార్డెన్స్, ద్వారకానగర్, ఎంవిపి కాలనీ, బీచ్‌రోడ్డు ప్రాంతాలలోని దుకాణాలలో విక్రయిస్తున్నారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

గాలిపటాలను ఎగురవేయాలన్న ఉత్సాహం ఓ వైపు... తగిన జాగ్రత్తలు ఎలా తీసుకోవాలో తెలియక మరో వైపు చిన్నారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అందువల్ల గాలి పటాలు ఎగురవేసే సందర్భాల్లో పెద్దలే పిల్లలకు తగిన జాగ్రత్తలు తెలియజేయాలి. అవసరమైతే దగ్గరుండి వారిచే గాలిపటాలు ఎగురవేయించాలి.

- పతంగులను మనం ఎక్కడ నుంచి ఎగురవేస్తున్నాం, అక్కడున్న భౌగోళిక పరిస్థితులు ఏమిటి, రాళ్లు, ముళ్లు, గాజు పెంకులు లేదా భవనం మీది నుంచి ఎగురవేస్తే శ్లాబ్ విస్తీర్ణం వంటి వాటిని అవగాహన చేసుకోవాలి.
- గాలిపటాలను విద్యుత్ తీగలకు దూరంగా నిల్చుని ఎగురవేయాలి. ప్రధానంగా టవర్లకు దూరంగా ఉండాలి.
- డాబాలకు విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో ఉంటాయి. దీంతో ఇక్కడ ఎక్కువ జాగ్రత్తగా ఉండాలి.
- గాలిపటాలు విద్యుత్ తీగలకు తగిలి ఇరుక్కుపోతే వాటిని తీసేందుకు ప్రయత్నించవద్దు. డాబాపై ఇనుపరాడ్లు, పొడవాటి ఇనుప వస్తువులు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

పందేలకు కోళ్లు రెడీ

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట

సంక్రాంతి పండగలో గ్రామీణ ప్రాంతాల్లో కోడి పందాలకు ప్రాధాన్యత ఇస్తారు. ప్రభుత్వం నిబంధనలు, కోర్టు ఆదేశాలతో కోడి పందాలకు అనుమతులు లేకపోయినా పందెం రాయుళ్లు మాత్రం ఏదో విధంగా మారుమూల ప్రాంతాల్లోనైనా కోడి పందాలు ఆడడం మామూలే. పండగ సందర్భంగా.. భోగి పండగ రోజు కొన్ని గ్రామాల్లో, సంక్రాంతి రోజున మరికొన్ని గ్రామాల్లో, కనుమ రోజున ఇంకొన్ని గ్రామాల్లో తీర్థాలు జరుగుతుంటాయి. ఆయాచోట్ల గతంలో అధిక సంఖ్యలో కోడి పందాలు జరుగుతుండేవి. ప్రస్తుతం కోడి పందాలపై నిషేధం ఉంది. అయినప్పటికీ పందాలకు కోళ్లను సిద్ధం చేయడం మండలంలో కనిపిస్తోంది. పందెం కోడి ఒక్కొక్కటీ ఒక్కో దర పలుకుతోంది. గ్రామీణ ప్రాంతంలో నాలుగు వేల రూపాయల నుంచి పది వేల రూపాయలు వరకు ధర పలుకుతున్నాయి. వీటికి ప్రత్యేక ఆహారంగా బాదం పిస్తా, కోడిగుడ్లు, గంటి, చోడి తదితర కొవ్వు పట్టని ఆహారాన్ని అందిస్తూ ఉన్నారు. అలాగే ఉదయం, సాయంత్రం వేళల్లో ఆయాసం తట్టుకునే విధంగా నూతిలో ఈత కొట్టిస్తూ శిక్షణ ఇస్తున్నారు. కాకి, నెమలి, చేతువా, డేగ, నెమలి డేగ, తదితర రకాలు ఈ కోళ్లలో ఉన్నాయి. రకాల బట్టి ధరలు ఉంటాయని పందెం రాయుళ్లు అంటున్నారు.

కత్తి పందాలకే ప్రాధాన్యత

కోడి పందాల్లో ఎక్కువగా కత్తి పందాలకే ప్రాధాన్యత ఇస్తారు. ఐదు నుంచి పది నిమిషాల్లోనే పందెం పూర్తయిపోతుంది. గతంలో అయితే కోడి కాళ్లకు కత్తులు కట్టకుండా డింకీ పందాలు మాత్రమే ఆడుతూ ఉండేవారు. డింకీ పందాలు గంటల తరబడి సాగుతుండడంతో ఆ పందాలకు పందెం రాయుళ్ల ప్రాధాన్యత ఇవ్వడం లేదు. కోడి కత్తి పందాలలో వేలాది రూపాయలు చేతులు మారుతూ ఉంటాయి.



పందానికి సిద్ధమైన కోడి పుంజు